# రైతులు రోడ్డెక్కితేనే పరిపాలన మేల్కొంటుందా? ముందుచూపు ఎక్కడ?

అమలాపురం(బిఎన్ఎస్)జూలై 14: కోనసీమ జిల్లాలో ఖరీఫ్ సాగు ప్రారంభమవుతున్న సమయంలో రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయాల్సిన పరిస్థితి ఏర్పడడం జిల్లా పరిపాలన వైఫల్యానికి నిదర్శనం. సాగు సీజన్ ఎప్పుడు ప్రారంభమవుతుందో ముందే తెలిసినా, కాలువల మరమ్మత్తు పనులు పూర్తి చేయకపోవడం, వంతెనల నిర్మాణాల కోసం వేసిన క్రాస్ బండ్‌లను తొలగించకపోవడం వల్ల కాల్వల్లో నీటి ప్రవాహం నిలిచిపోయింది. జిల్లా కలెక్టర్‌గా వ్యవసాయం, సాగునీటి నిర్వహణ, వివిధ శాఖల మధ్య సమన్వయం కల్పించడం ప్రధాన పరిపాలనా బాధ్యతల్లో ఒకటి. సాగు సీజన్‌కు ముందే ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్ శాఖలతో సమీక్షలు నిర్వహించి, రైతులకు ఎప్పటి నుంచి నీరు విడుదల చేయాలనే కార్యాచరణను అమలు చేయాల్సి ఉంది. అలాంటి ముందస్తు చర్యలు కనిపించకపోవడంతో రైతులు ఆందోళనకు దిగాల్సి వచ్చింది. సాగునీటి సమస్యతో పాటు వ్యవసాయ విద్యుత్ సరఫరాపైనా రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు నీరు లేక, మరోవైపు విద్యుత్ సమస్యలు వెంటాడుతుంటే రైతు ఎలా సాగు చేయగలడు?





ఈ ప్రశ్నకు జిల్లా యంత్రాంగం సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది.

రైతులు ఇప్పుడు స్పష్టమైన హెచ్చరిక చేస్తున్నారు. "వారంలో సమస్యలు పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్తంగా క్రాప్ హాలిడే అమలు చేస్తాం" అని ప్రకటించారు. ఈ పరిస్థితి ఏర్పడకముందే సమస్యలను గుర్తించి పరిష్కరించడం పరిపాలన బాధ్యత. రైతులు ధర్నా చేసిన తర్వాత స్పందించడం సమర్థవంతమైన పాలనగా చెప్పలేం.

జిల్లా కలెక్టర్ వెంటనే అన్ని సంబంధిత శాఖలతో అత్యవసర సమీక్ష నిర్వహించి, కాల్వల్లోని క్రాస్ బండ్‌ల తొలగింపు, సాగునీటి విడుదల, వ్యవసాయ విద్యుత్ సరఫరా, కాలువల పనుల పూర్తి వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి. రైతుల నమ్మకాన్ని నిలబెట్టడం జిల్లా యంత్రాంగం బాధ్యత.

రైతు బాగుంటేనే జిల్లా బాగుంటుంది. రైతు పొలం పచ్చగా ఉంటేనే కోనసీమ పచ్చగా ఉంటుంది. రైతుల కష్టాలు పెరిగి వారు "క్రాప్ హాలిడే" ప్రకటించే పరిస్థితి వస్తే, అది రైతుల ఓటమి కాదు---వ్యవస్థ ముందుచూపు లోపించినదనే విమర్శకు తావిస్తుంది.

# ఖరీఫ్ మొదలుకాగానే ఎండబారిన పొలాలు..

## నందిగాం రైతుల ఆవేదన

నందిగాం (బిఎన్ఎస్ న్యూస్): ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన కొద్ది రోజులకే నందిగాం మండలంలోని పలు గ్రామాల రైతులు సాగునీటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 45 రోజులుగా సరైన వర్షాలు కురవకపోవడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారు మడులు, వరి ఎదలు తగినంత తేమ లేక ఎండిపోతుండగా, కొన్నిచోట్ల కురిసిన చిరుజల్లులు కూడా పంటలకు ఉపయోగపడలేదని తెలిపారు.

ముఖ్యంగా పెద్దబాణాపురం, కవిటి అగ్రహారం, ఆనందపురం, పాత్రునివలస గ్రామాల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు పూర్తిస్థాయిలో మొలకెత్తకపోవడంతో మళ్లీ విత్తనాలు వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులతో అప్పుల్లో కూరుకుపోయామని రైతులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రైతులు కింతల ఢిల్లీశ్వరరావు, కొండాల ధర్మారావు, చంద్రశేఖర్, కర్రన్న, శ్రీరాములు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ సాగునీటి ఏర్పాట్లు చేయాలని కోరారు. చెరువులు, కాలువల ద్వారా నీటి సరఫరా చేయడంతో పాటు, ఎండబారిన పంటలకు ప్రత్యేక సహాయ ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ శాఖ అధికారులు సందర్శించి పంట





నష్టాన్ని అంచనా వేసి రైతులకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే ఏర్పడిన ఈ పరిస్థితిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి రైతాంగాన్ని ఆదుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

# స్కూల్ బస్సు డ్రైవర్లు, ఆయాలకు ట్రాఫిక్ అవగాహన సదస్సు

విద్యార్థుల భద్రతను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో, బండ్లగూడలోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ లో స్కూల్ బస్సు డ్రైవర్లు, ఆయాలకు ఒక సమగ్ర ట్రాఫిక్ అవగాహన సదస్సును నిర్వహించారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మరియు గోషామహల్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సదస్సులో పాఠశాల రవాణా విభాగానికి చెందిన మొత్తం 50 మంది సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అధికారులు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ మరియు సురక్షిత ప్రయాణ విధానాలపై సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.

ముఖ్యంగా క్రింది అంశాలపై కూలంకషంగా వివరించారు:

ట్రాఫిక్ సంకేతాలు & గుర్తులు: తప్పనిసరిగా పాటించాల్సిన ట్రాఫిక్ సైన్‌బోర్డులు, హెచ్చరిక సైన్‌బోర్డులు , సమాచార సైన్‌బోర్డులు మరియు రోడ్డు మార్కింగ్‌ల ప్రాధాన్యత.





సురక్షిత డ్రైవింగ్ విధానాలు: వాహన వెనుక భాగాలను గమనించే అద్దాల ప్రాముఖ్యత, సురక్షితమైన ఓవర్‌టేకింగ్ పద్ధతులు మరియు ఓవర్‌టేక్ చేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.

విద్యార్థుల భద్రత: బస్సు ఎక్కేటప్పుడు మరియు దిగేటప్పుడు విద్యార్థుల విషయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, అలాగే విద్యార్థుల భద్రతను పర్యవేక్షించడంలో ఆయాలు/వాహన అసిస్టెంట్ల బాధ్యతలు మరియు విధులు.

జంక్షన్ల నిర్వహణ: రౌండ్‌అబౌట్‌లు (రోటరీలు) ఉన్నచోట పాటించాల్సిన నియమాలు మరియు సురక్షితంగా వాహనాన్ని నడిపే విధానం.

చట్టపరమైన అవగాహన: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు – వాటి వల్ల కలిగే తీవ్ర పరిణామాలు మరియు సాధారణ రోడ్డు భద్రతా సూచనలు.

ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీహెచ్ రాజు,, గోషామహల్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, మరియు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పాఠశాల కార్యదర్శి విశ్వేశ్వరరావు సూచనల మేరకు స్కూల్ ప్రిన్సిపాల్ రమ విశ్వనాథన్ కార్యక్రమం ను సమన్వయం చేశారు.

# ప్రజలారా నేరాలకు దూరంగా ఉండండి.. హెచ్చరించిన కడప పోలీస్

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 14: రౌడీ షీటర్లకు, నేరచరిత్ర గల వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి పోలీసుల స్ట్రాంగ్ వార్నింగ్ చేస్తున్న క్రమంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపిఎస్ ఆదేశాల మేరకు నేరాలకు దూరంగా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్న కడప జిల్లా పోలీసులు జిల్లాలో నేర నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ



లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ విస్తృత చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జిల్లా లోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లు, నేరచరిత్ర గల వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. కౌన్సిలింగ్ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ.. సమాజంలో సత్ప్రవర్తనతో జీవించాలని, నేరప్రవృత్తికి పూర్తిగా స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని స్పష్టంగా సూచించారు. నేరాల వైపు వెళ్లకుండా గౌరవప్రదమైన జీవనం గడపాలని హితవు పలికారు. అదేవిధంగా, భవిష్యత్తులో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో శాంతియుత వాతావరణం కొనసాగించేందుకు, ప్రజల భద్రతే ధ్యేయంగా జిల్లా పోలీసు శాఖ ఇలాంటి అవగాహన, నియంత్రణ చర్యలను నిరంతరం కొనసాగిస్తుందని తెలిపారు.

# పారదర్శకంగా భూముల రీ సర్వే : కలెక్టర్

నల్లగొండ (బిఎన్ఎస్): ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా భూముల రీ సర్వేను నిర్వహించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సర్వేయర్లను ఆదేశించారు. నల్లగొండ లోని ఎన్జీ కళాశాల లో భూముల రీ సర్వే విషయమై సర్వేయర్లకు



ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.... గతంలోని రికార్డులను ఆధారం చేసుకుని సర్వే నిర్వహించాలని, సర్వే నంబర్ ట్యాలీ చేసుకుని నిర్ధారణకు వచ్చిన తర్వాత సర్వే చేయాలన్నారు.. సర్వేలో తప్పిదాలు జరిగితే ప్రజలు నష్టపోయే అవకాశం ఉంటుందని అందువల్ల అత్యంత అప్రమత్తంగా, పారదర్శకంగా సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఒక గ్రామంలో సర్వే నిర్వహించే సమయంలో ప్రభుత్వ భూములు, పట్టా భూములు, ప్రాజెక్టుల కింద ఉన్న భూములు, అలాగే గ్రామకంఠం, గ్రామపంచాయతీ , మున్సిపల్ భూములు అన్నింటిని దృష్టిలో ఉంచుకొని సర్వే నిర్వహించాలన్నారు. సర్వేలో చైన్ మరియు రోవర్ లను ఉపయోగించాలని, చట్టం ప్రకారమే నియమనిబంధనలను అతిక్రమించకుండా సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు.

# కాపు ఉద్యమకారుడు మాజీ మంత్రి ముద్రగడ మృతిపై పలువురు సంతాపం

కాకినాడ (బిఎన్ఎస్) జూలై 14: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకే కాకుండా యావత్ రాష్ట్రం తన వైపు తిప్పుకునేలా అనేకసార్లు ఉద్యమాలు చేసిన ఉద్యమ నాయకుడు ఎంతోమందికి ఉద్యోగ ఉపాధి కల్పించిన మహోన్నత వ్యక్తి మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యులు ముద్రగడ పద్మనాభం మృతి యావత్ రాష్ట్రానికే తీరనిలోటని పలువురు రాజకీయ నాయకులు అభిప్రాయపడ్డారు. ఏ పని తలపెట్టిన తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నాయకుడు ముద్రగడ పద్మనాభం అని తను అనుకున్నదే న్యాయమని దాని కోసం ఎంత దూరమైనా ఎంత చాగానికి అయిన తెగించి ముందుకెళ్లే సత్తా ఉన్న నాయకుడు ముద్రగడ పద్మనాభం చివరి దశలో కొన్ని అనివార్య కారణాలవల్ల ఆయనకు ఒక మచ్చని తెచ్చిపెట్టింది లేకుంటే రాష్ట్రంలో కాపుల్లో ముఖ్యమంత్రి హోదా చేసే అర్హత ఆయనకు ఉండేది కానీ ఆయన తీసుకున్న కొన్ని తొందరపాటు నిర్ణయాల వల్ల ఆయన రాజకీయ భవిష్యత్తుకే కాకుండా కుటుంబానికి కూడా తీరనిలోటని ఏది ఏమైనా ముద్రగడ మరణం రాష్ట్ర రాష్ట్రానికి కాపు జాతికి తీరనిలోటని ఆయన అభిమానులు రాజకీయ నాయకులు పలువురు అభిప్రాయపడ్డారు.



# ముగ్గురి ప్రాణాలు కాపాడిన రాపూరు యస్.ఐ. మరియు సిబ్బంది

## సకాలంలో స్పందించిన 112 కాల్

నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్):– కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరు కుమార్తెలతో సహా ఓ తల్లి ఆత్మహత్యకు ప్రయత్నించగా, రాపూరు పోలీసులు సకాలంలో స్పందించి వారి ప్రాణాలను కాపాడారు. ఈ ఘటన మంగళవారం ఉదయం రాపూరు గ్రామంలో చోటుచేసుకుంది.పోలీసులు, స్థానికుల వివరాల మేరకు... రాపూరు మండలం అరుంధతివాడకు చెందిన మల్లవరం లక్ష్మి (34) కుటుంబ గొడవల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో తన ఇద్దరు కుమార్తెలు కార్తిక (10), కావ్య (7)లతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఉదయం సుమారు 09:50 గంటల సమయంలో ఇంటి తలుపులు లోపల నుంచి వేసుకుని, పిల్లలతో సహా ఉరివేసుకునేందుకు ప్రయత్నించింది.ఇది గమనించిన స్థానికులు వెంటనే '112' అత్యవసర నంబరు ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే రాపూరు ఎస్ఐ, మరియు వారి సిబ్బంది తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లోపలి నుంచి గడియ పెట్టి ఉండటంతో, ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఇంటి కిటికీ రేకులను తొలగించి లోపలికి ప్రవేశించి ఉరివేసుకోబోతున్న తల్లిని, ఇద్దరు చిన్నారులను పోలీసులు సకాలంలో సురక్షితంగా రక్షించారు. పోలీసుల మెరుపు వేగంతో స్పందించి, తృటిలో పెద్ద ప్రమాదాన్ని తప్పించి మూడు ప్రాణాలను కాపాడటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సకాలంలో స్పందించి మానవత్వాన్ని చాటుకున్న రాపూరు పోలీసులను గ్రామస్తులు, ప్రజలు అభినందనలు తెలిపారు.




# రేపు ఉద్యోగులకు ప్రత్యేక గ్రీవెన్స్

## -జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు జిల్లా కలెక్టరేట్(బిఎన్ఎస్):– రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రేపు అనగా ఈ నెల 16వ తేదీ గురువారం ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం ఈనెల 16వ తేదీ ఉదయం 11.00 గంటలకు నెల్లూరు కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించబడుతుందని ఆయన పేర్కొన్నారు.అదేవిధంగా జిల్లాలోని అన్ని శాఖల అధిపతులు తమ శాఖలలోని ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలకు ఈ విషయాన్ని తెలియజేసి, ఉద్యోగులు తమ వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సమక్షంలో సమర్పించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.అదేవిధంగా అన్ని శాఖల అధిపతులు గతంలో ఉద్యోగుల నుంచి అందిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యల నివేదికలతో ఈనెల 16వ తేదీ ఉదయం 11.00 గంటలకు తిక్కన ప్రాంగణంలో నిర్వహించే ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



# ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్):– నెల్లూరు జిల్లా రాపూరులోని షాదీ మంజిల్‌లో చాగణం లలితమ్మ--భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ వైద్య బృందం పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు.?ఈ సందర్భంగా ట్రస్ట్ సీఈవో సీతారామ నాయుడు మాట్లాడుతూ, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని ప్రతి మండలంలోనూ ఇలాంటి ఉచిత శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కంటి సమస్యలున్న వారు ఈ అవకాశాన్ని వాడుకోవాలని, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు కూడా చేయిస్తామని ఆయన తెలిపారు.



# రహదారి వంతెనపై గుంత.. ప్రమాదాలకు ఆహ్వానం

నెల్లూరు జిల్లా సైదాపురం (బిఎన్ఎస్):– నెల్లూరు జిల్లా సైదాపురం మండల కేంద్రం నుంచి పొదలకూరుకు వెళ్లే ప్రధాన రహదారిలో వర్మిక్లేట్ ఫ్యాక్టరీ సమీపంలోని వంతెనపై భారీ గుంత ఏర్పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. గుంత వద్ద తాత్కాలికంగా కొమ్మలు, కేబుల్ పైపు ఉంచినప్పటికీ శాశ్వత మరమ్మతులు చేపట్టలేదు. ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.




# సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో మంత్రి నారాయణ సమావేశం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చిన సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో మంత్రి నారాయణ సమావేశం అయ్యారు. సమావేశంలో పాల్గొన్న సింగపూర్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ మంత్రిత్వ శాఖ సీనియర్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ చాంగ్,సింగపూర్ కోఆపరేషన్ ఎంటర్ప్రైజ్ ప్రతినిధులు ఉన్నారు. అమరావతి నిర్మాణంలో వివిధ రంగాల్లో సహకారం అందించేందుకు సింగపూర్ ప్రతినిధులు ముందుకు వచ్చారు. వివిధ ప్రాజెక్టుల నిర్మాణంలో సింగపూర్ అనుభవాలు, సాంకేతిక పరిజ్ఞానం,శిక్షణతో పాటు సలహాలు,సూచనలు అందించనున్నారు. ప్రపంచ స్థాయి రాజధానిగా నిర్మాణం చేయడానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు.



# నక్ష రీ సర్వేతో భువివాదాలకు శాశ్వత పరిష్కారం



యాదగిరిగుట్ట (నల్లగొండ) బిఎన్ఎస్ : ప్రభుత్వం చేపట్టిన నక్షా రీ సర్వే ద్వారా భూ రికార్డుల్లో పారదర్శకత పెరగడంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు... యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నక్షా సర్వే కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు.. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, నివాస గృహాలు, ప్లాట్ల వాస్తవ హద్దులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా నిర్ధారిస్తున్నారో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... భూ యజమానుల సమక్షంలో హద్దులను గుర్తించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితమైన కొలతలను నమోదు చేయాలని సర్వే సిబ్బందికి సూచించారు. సర్వే సమయంలో భూ యజమానులకు పూర్తి సమాచారం అందిస్తూ, వారి అభ్యంతరాలను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యతతో, వేగవంతంగా నక్షా సర్వేను పూర్తి చేసి ప్రతి ఆస్తికి ఖచ్చితమైన హద్దులను నిర్ధారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ అధికారులు, జిల్లా ల్యాండ్ అండ్ సర్వే అధికారి సుజాత, సర్వే బృందాల సిబ్బంది, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎబివిపి కళాశాలల బంద్ ప్రశాంతం

నల్లగొండ (బిఎన్ఎస్): పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎబివిపి నల్లగొండ జిల్లా కన్వీనర్ కొంపల్లి సూర్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. ఫీజు బకాయిల కోసం ఎబివిపి రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా కళాశాలల బంద్ నిర్వహించారు.. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలలతో పాటు, నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ లో కూడా తరగతులు బహిష్కరించిన ఎబివిపి కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయంబర్స్ మెంట్ పథకాన్ని తీసి వేసే కుట్ర చేస్తుందని, గత మూడు సంవత్సరాలుగా9వేల కోట్ల కు పైగా ఫీజు, స్కాలర్ షిప్ బకాయిలు పేరుకుపోయాయి అని ఫీజులు చెల్లించకపోవడం వల్ల వేలాదిమంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు....

## పోచంపల్లిలో ఈవీ పారిశుధ్య వాహనాల ప్రారంభం




భువనగిరి (నల్లగొండ) (బిఎన్ఎస్) : యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మున్సిపాలిటీలో పారిశుధ్య సేవలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో రెండు నూతన ఈవీ పారిశుధ్య వాహనాలను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పారిశుధ్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. పరిశుభ్రమైన పట్టణ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ వాహనాల ద్వారా ఇంటింటికీ చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ మరింత సమర్థవంతంగా జరిగి ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందుతాయని చెప్పారు.

## అప్పు కట్టలేదని

# నాలుగేళ్లుగా బందీ!

### భార్యాభర్తలతో వెట్టిచాకిరీ.. నిర్మాణ భవనంలో నిర్బంధం

### భార్య వైద్యానికి రూ.3 లక్షల అప్పు.. బాండెడ్ లేబర్‌గా మార్చిన కాంట్రాక్టర్లు




మియాపూర్: భార్య వైద్య చికిత్స కోసం తీసుకున్న అప్పు ఓ కుటుంబాన్ని నాలుగేళ్లుగా బందీ జీవితంలోకి నెట్టేసింది. రూ.3 లక్షల అప్పు పేరుతో భార్యాభర్తలను అక్రమంగా నిర్బంధించి, వారితో వెట్టిచాకిరీ చేయిస్తున్నారనే సంచలన ఘటన మియాపూర్ పోలీస్ పరిధిలో వెలుగుచూసింది.o

శేరిలింగంపల్లి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎ. శ్రీను ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కోట శ్రీనివాస్ (40) తన భార్య రమ్య వైద్య చికిత్స నిమిత్తం కాంట్రాక్టర్ రాములు వద్ద రూ.2 లక్షలు, మరో కాంట్రాక్టర్ కృష్ణ వద్ద రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు.

అప్పు చెల్లించాలంటూ శ్రీనివాస్, అతని భార్య రమ్యను న్యూ హాఫీజ్‌పేట్‌లోని ప్రేమ్‌నగర్‌లో ఉన్న నిర్మాణంలో ఉన్న భవనానికి తీసుకెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్కడ వారిని అక్రమంగా నిర్బంధించి.. బయటకు వెళ్లనివ్వకుండా గత నాలుగేళ్లుగా బాండెడ్ లేబర్లుగా వెట్టిచాకిరీ చేయిస్తున్నట్లు రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చింది.

ఈ వ్యవహారంపై మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎ. శ్రీను పంచనామా వాంగ్మూలాన్ని అధికారులకు అందజేశారు. అప్పు పేరుతో నాలుగేళ్లుగా భార్యాభర్తలను నిర్బంధించి పని చేయించారన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర కలకలం రేపాయి.

# బేటీ బచావో బేటీ పడావో

### మహిళా సాధికారతకు సమిష్టి కృషి -- జిల్లా కలెక్టర్




నల్లగొండ (బిఎన్ఎస్) : బేటీ బచావో బేటీ పడావో' పథకంలో భాగంగా గతంలో ఏర్పాటు చేసిన బాలికా చైతన్యం అనే అద్భుతమైన కార్యక్రమాన్ని ఈ సంవత్సరం కూడా విజయవంతంగా కొనసాగించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.. బాలికల రక్షణ, విద్యాభివృద్ధి తో పాటు మహిళా సాధికారత సాధనే లక్ష్యంగా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.. బేటీ బచావో బేటీ పడావో' (BBBP) పథకంలో భాగంగా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన వివిధ శాఖల ఉన్నతాధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... బాలికల్లో అవగాహన, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి బాలికా చైతన్యం కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు ఆగస్టు నెలాఖరుకల్లా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 'పోష్' (POSH) కమిటీల ఏర్పాటుకు చేయాలని అన్నారు.. భ్రూణ హత్యా నిరోధక చట్టం (PCPNDT Act), సురక్షిత గర్భ విచ్ఛిత్తి చట్టం (MTP Act) జిల్లాలో పటిష్టంగా అమలు కావాలని, లింగ నిర్ధారణ పరీక్షలను కూడా అరికట్టేందుకు సంబంధిత అధికారులు వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో కలిసి పనిచేయాలని అన్నారు.. కార్యక్రమం చివరలో బేటిబచావో బెటిపడావో కార్యక్రమంపై రూపొందించిన గోడ పత్రికను అధికారులతో కలిసి ఆవిష్కరించారు..

# సింగరేణి కార్మికులకు పూర్తిస్థాయిలో భరోసా




సింగరేణి యాత్రలో భాగంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు తో కలిసి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వివిధ ప్రాంతాలను సందర్శించారు. కార్మికులు మహిళలు యువత పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.

రామగుండం ఏరియా - 1 లో కార్మికుల సమావేశం లో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. సింగరేణి తెలంగాణకు ఒక ఆస్తి. సింగరేణి అంటే లక్షలాది కుటుంబాలకు జీవనాధారం. తెలంగాణతో పాటు దక్షిణ భారతదేశానికే బొగ్గు సరఫరా చేస్తున్న అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలకు కూడా బొగ్గు సరఫరా చేస్తూ దేశ విద్యుత్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తోంది. వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తూ, తెలంగాణ ఆర్థికాభివృద్ధికి సింగరేణి వెన్నెముకలా నిలుస్తోంది.

అయితే, ఈరోజు సింగరేణి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఎందుకు ఈ పరిస్థితి వచ్చింది? ఎందుకు ఆర్థిక ఒత్తిడిలో పడింది? అనే విషయాలను మనం నిజాయితీగా పరిశీలించాలి. ఉత్పత్తి పెంచే అవకాశాలు ఉన్నప్పటికీ, కృత్రిమంగా ఆర్థిక భారం మోపడం వల్ల అప్పులు తీసుకుని వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది అన్నారు.

గత 15--16 సంవత్సరాలుగా బొగ్గు బ్లాకుల కేటాయింపులపై వివాదాలు కొనసాగాయి. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన బొగ్గు బ్లాకుల కేటాయింపులను రద్దు చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం పారదర్శకమైన కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. మొత్తం 204 బొగ్గు బ్లాకులను వేలం Auction లేదా నామినేషన్ విధానంలో కేటాయించే వ్యవస్థను అమలు చేసింది. ఈ విధానంలోనే సింగరేణికి కూడా కోల్ బ్లాకులు కేటాయించబడ్డాయి.

ఇప్పుడు అదే విధానాన్ని అమలు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఆశ్చర్యంగా ఉంది. గతంలో వారు అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన విధానాలనే ఇప్పుడు తప్పుబడుతున్నారు. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం తప్ప మరొకటి కాదు. అని వివరించారు.

మరో కోల్ బ్లాక్ కూడా సింగరేణికి రావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. మేము కూడా అదే కోరుతున్నాం. సింగరేణి మరింత బలోపేతం కావాలి. కార్మికులకు ఉపాధి భద్రత పెరగాలి. అందుకోసం కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తోంది అని చెప్పారు.

# లోకేష్ సార్ ఏసీసీ సిమెంటు పరిశ్రమ నిర్మాణం కూడా కాస్త చూడండి

### సిపిఎం నాయకులు శివ నారాయణ.



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 14:

దాల్మియా సిమెంటు పరిశ్రమ రెండో దశ ప్లాంటు నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, మరియు విద్య శాఖ మంత్రి లోకేష్ విస్తరణ పనుల ప్రారంభానికి వస్తున్న నేపథ్యంలో కడపజిల్లా పరిశ్రమల ఖిల్లాగా మారుతుంది అని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు అని చెప్పొచ్చు. కానీ రెండు దశాబ్ద కాలంగా వద్దిరాల, గొల్లపల్లె వద్ద ఏసీసీ సిమెంటు పరిశ్రమ నిర్మాణం కోసం భూములు తీసుకున్నారని, ఇప్పుడు ఆ పరిశ్రమ ప్రశ్నార్థకరంగా మారిందన్నారు. ఏసీసీ సిమెంటు పరిశ్రమ నిర్మాణం ఎప్పుడని సిపిఎం నాయకులు వీరణాల శివ నారాయణ ప్రశ్నించారు. మంగళవారం మైలవరం నందు మీడియా సమావేశంలో శివనారాయణ మాట్లాడుతూ.. రెండు దశాబ్దల కాలంగా గొల్లపల్లె, వద్దిరాల, చిన్న వెంతుర్ల, బెస్తవేముల, జంగాలపల్లె, జి. ఉప్పలపాడు, గ్రామాల ప్రజలతో ఏసీసీ సిమెంటు పరిశ్రమ నిర్మిస్తామని, భూములున్న రైతుల వద్ద సుమారుగా 2500 ఎకరాలు పైగానే భూములు తీసుకున్నారని, అప్పట్లో ప్రజాభిప్రాయ సేకరణ సైతం చేశారని తెలిపారు. నేటికీ రెండు దశాబ్దాల కాలం గడిచిపోతున్న పరిశ్రమ నిర్మాణం జరగలేదు అన్నారు. భూములు ఇచ్చిన ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కూడా ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ దాల్మియా సిమెంట్ పరిశ్రమ ప్లాంట్ టు నిర్మాణం విస్తరణ శంకుస్థాపన కోసం వస్తున్నారని, అక్కడి భూ నిర్వాసితులు తీవ్రస్థాయిలో తమ సమస్యలు పరిష్కరించిన తర్వాతే దాల్మియా పరిశ్రమ విస్తరణ చేపట్టాలని పోరాడుతున్నారని, వారికి సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు లక్ష్మీనారాయణ, ఓబులేసు, పాల నారాయణ పాల్గొన్నారు.

# బస్తీ దవాఖానలో ప్రైవేట్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు.. వైద్యాధికారుల తీరుపై ప్రశ్నలు



శేరిలింగంపల్లి బిఎన్ఎస్ న్యూస్ , జూలై 14 : ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ బస్తీ దవాఖాన ఆవరణలో ప్రైవేట్ నిర్మాణదారుడి కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం వివాదానికి దారితీసింది. గంగారం బస్తీ దవాఖాన ప్రాంగణంలో ప్రైవేట్ అవసరాల కోసం విద్యుత్ శాఖ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు చేపట్టడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి స్థలాన్ని ప్రైవేట్ అవసరాలకు వినియోగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

స్థానికుల వివరాల ప్రకారం... దవాఖాన ఆవరణలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు, ముఖ్యంగా చిన్నారుల భద్రతపై ఆందోళనలు నెలకొన్నాయి. ప్రతి బుధ, శనివారాల్లో నెలసూదులు, టీకాల కోసం పెద్ద సంఖ్యలో శిశువులు, చిన్నారులు తమ తల్లిదండ్రులతో కలిసి ఈ బస్తీ దవాఖానకు వస్తుంటారు. ఇలాంటి సమయంలో ఆస్పత్రి ప్రాంగణంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వ్యవహారంలో సంబంధిత వైద్యాధికారులు ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయకపోవడం, ఆస్పత్రి ఆవరణలో పనులు జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ ఆస్తిని ప్రైవేట్ అవసరాలకు వినియోగించేందుకు ఎవరు అనుమతి ఇచ్చారు? ఆస్పత్రి భద్రతా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అత్యవసర వైద్య సేవలు అందే ప్రభుత్వ దవాఖానల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. గంగారం బస్తీ దవాఖానలో ఏర్పాటు చేస్తున్న ఈ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తక్షణమే తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఈ వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# 'కాఫీ విత్ ఏ కాప్'.. సైబర్ భద్రతపై యువ ఉద్యోగులకు అవగాహన



హైదరాబాద్, జూలై 14 (బీఎన్ఎస్):

సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (రాజూజ) సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హెచ్ఎస్‌బీసీ (HSBC) క్యాంపస్‌లో 'కాఫీ విత్ ఏ కాప్' 5వ ఎడిషన్‌ను మంగళవారం విజయవంతంగా నిర్వహించారు. "డిజిటల్ డైలమాస్: లెట్స్ నావిగేట్ ఇట్ టుగెదర్" అనే ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమంలో 130 మందికి పైగా హెచ్ఎస్‌బీసీ యువ ఉద్యోగులు పాల్గొన్నారు. సైబర్ భద్రత, బాధ్యతాయుతమైన డిజిటల్ ప్రవర్తనపై పోలీసు అధికారులతో ఉద్యోగులు ముఖాముఖిగా మాట్లాడేందుకు, తమ అభిప్రాయాలను పంచుకునేందుకు ఈ కార్యక్రమం ఒక చక్కని వేదికగా నిలిచింది.

కార్యక్రమం ప్రారంభంలో ఎస్‌సీఎస్‌సీ (SCSC) స్ట్రాటజిక్ ఆపరేషన్స్ డైరెక్టర్ రష్మీ శ్రీవాస్తవ అందరికీ స్వాగతం పలికారు. ఐటీ పరిశ్రమలు, పోలీస్ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం ద్వారా ఉద్యోగులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే ఎస్‌సీఎస్‌సీ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఈ సెషన్‌లో కేవలం సైబర్ నేరాలే కాకుండా, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు, శబ్ద కాలుష్యం వంటి పౌర సమస్యలపై కూడా ఉద్యోగులు పోలీసులతో సుదీర్ఘంగా చర్చించారు. సైబర్ నేరాల పరిష్కారంలో సైబరాబాద్ పోలీసులు అందిస్తున్న తక్షణ సహాయాన్ని ఉద్యోగులు అభినందించారు.

సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ కె. పుష్ప, సైబర్ క్రైమ్ వింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డీసీపీ పుష్ప మాట్లాడుతూ, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, ఫిషింగ్, డేటా ప్రైవసీ, సోషల్ మీడియా ముప్పులు మరియు తప్పుడు సమాచారం వల్ల కలిగే నష్టాలను ఉదాహరణలతో వివరించారు. లింక్‌లపై క్లిక్ చేసే ముందు లేదా ఆన్‌లైన్ లావాదేవీలు చేసే ముందు ఒక్క క్షణం ఆలోచించి, సరిచూసుకోవాలని (వెరిఫై చేయాలని) సూచించారు. యువతకు "ఆగండి (Pause), సరిచూసుకోండి (Verify), రక్షించుకోండి (Protect)" అనే ముఖ్యమైన సందేశాన్ని ఆమె ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీపీ తన వ్యక్తిగత జీవితం, బాధ్యతల గురించి పంచుకోవడంతో ఉద్యోగులు ఆమెతో ఎంతో స్నేహపూర్వకంగా సంభాషించారు.

ఈ కార్యక్రమంలో హెచ్ఎస్‌బీసీ మేనేజింగ్ డైరెక్టర్, ఎస్‌సీఎస్‌సీ మహిళా భద్రతా విభాగం జాయింట్ సెక్రటరీ మమతా మదిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. సైబర్ అవగాహన కలిగిన సురక్షితమైన పని వాతావరణాన్ని నిర్మించడంలో హెచ్ఎస్‌బీసీ, సైబరాబాద్ పోలీస్, ఎస్‌సీఎస్‌సీల ఉమ్మడి నిబద్ధతను ఆమె పునరుద్ఘాటించారు. చివరగా ఉద్యోగుల సందేహాలకు అధికారులు సమాధానాలు ఇవ్వడంతో ఈ అవగాహన సదస్సు ముగిసింది.